


# ముడ్లూడని మల్లెమొగ్గ

పనగరం పార్థసారధి

చంద్రుణ్ణి చేరుకోవాలని తారవెన్నంటి పరుగెడుతూనే వుంది. ఆరాటపడే తారను చూస్తున్న వసుమతి మనస్సు ఒక్కచోట నిలువక తారతో సమంగా తపనపడుతూనే వుంది.

తన స్నేహితురాలు మంగళకు పద్దెనిమిదో ఏట పెళ్ళి జరిగినప్పుడు ఆమె తల్లి ఎంతో భారం తగ్గినట్టు సంతోషిస్తుంటే. ఆమె చాదస్తానికి తనేనోన్ని సార్లు నవ్వుకొంది. అపహాస్యం చేసింది. తన కర్మ కాకపోతే, ఆనాడు తనతల్లి వ్యధలోకూడా చాదసమే కనిపించింది. కానీ యీ నాడా చాదసంలోనే నిజం కనిపించేసరికి తన జీవితంలో అన్నీ పోయాయనిపించింది.

గొంతువరకు కప్పుకున్న తెల్లటి

# మాట్లాడని మల్లెమొగ్గ

దుప్పటి తీసేసి, మంచంమీద కూర్చుంది.

చంద్రుడు నడినెత్తిన మేఘాలమధ్య. దోబూచులాడుతున్నాడు. తార ఆరాటపడుతూనే వుంది.

చల్లగా గాలి వీచింది!
మల్లెతీగ మెల్లగా వూగింది!

మల్లెలంటే తనకెంతో యిష్టం. ఆ మల్లె మొక్కను తనేనాటి పెంచింది. పందిరి ఆసరాతో ఏపుగా ఎదిగి పూలతో వూగిపోతోంది. అదే తనపాలిటి శత్రువుగా సాధిస్తోంది. ఇష్టమైన మల్లెల వాసన భరించలేనిదిగా వుంది. ఆ తీగకు పందిరి ఆసరా వుంది.....

చల్లటి గాలిలో. ఎంతో వేడి.
చంద్రకిరణాల్లో ఎంతో వేడి.
మల్లెల సువాసనలో ఎంతో వేడి:

ఒళ్ళంతా దహించుకుపోతూంది. అసహనంగా ఇటుఅసహనంగా అటుపొర్లింది.

మనస్సు నిలకడగా లేదు.

నిస్పృహ నిలువునా ఆవరించేసరికి, వసుమతి కన్నుల్లో నీళ్ళు తిరిగాయి.

సుబ్బయ్య మేష్టారుకు లేకలేక కలిగింది వసుమతి. అతనిస్నేహితులు-సహోపాధ్యాయులు వచ్చి అభినందించి వెళ్ళారు. ఆ నాటి రాత్రి సుబ్బయ్య మేష్టారి భార్య రత్నమ్మ వూయల వూపుతుంటే, వసుమతినే చూస్తూ నిలబడ్డాడు.

"నా తల్లి గొప్ప యింటి కోడలయి సంతోషంగావుంటే నా మాతృత్వం ఫలించినట్టే" అనుకొంది రత్నమ్మ పాప భవిష్యత్తు నూహించుకుంటూ.

"నా చిట్టితల్లిని ఎన్ని అవాంతరాలొచ్చినా చదువుల సరస్వతిని చేయాల్సిందే"విద్యపైనున్నమక్కువ సుబ్బయ్య మేష్టారుకు మరో ఆలోచన యివ్వలేకపోయింది.

రత్నమ్మ సనాతన గృహిణి. అధునాతన పద్ధతు లామెకు తెలియక కాదు. అవి ఆమెకు గిట్టవు. ఏ పని అయినా సరియైన సమయంలో చేస్తేనే ఆనందం దక్కుతుందని ఆమె నమ్మిక. నమ్మిక మాత్రమే కాక అనుభవం కూడా.

వసుమతి స్కూలు ఫైనల్ పరీక్షలో స్కూలు ఫస్టు వచ్చింది. కూతురు పరీక్ష ప్యాసు కావడం రత్నమ్మకు ఆనంద కారణం. సుబ్బయ్య మేష్టారుకు గర్వ కారణం. తండ్రిలోని గర్వాన్నే పుణికి పుచ్చుకొంది వసుమతి.

"ఏమండీ, మా అన్నయ్యకు వుత్తరం వ్రాయండీ ఒకసారి." భోజనాల దగ్గర ప్రస్తావించింది రత్నమ్మ భర్తను.

సుబ్బయ్య మేష్టారు తల పైకెత్తలేదు. జవాబు యివ్వలేదు. భోజనం కానిస్తున్నాడు. అంటే సుబ్బయ్య మేష్టారుకి భోజనంమీద మక్కువని కాదు. ఎంతో అంతే! జీవించడానికే తినవలయుననే సిద్ధాంతం గలవాడు.

భార్య ఆంతర్యం తెలిసినవాడు కనుక. ఒక్కక్షణం జవాబు యివ్వకుండా వూరుకుంటే ఆ ప్రస్తావనను దాటేయవచ్చునను కొన్నాడు.

రత్నమ్మ మరలా అదేమాట అంది.

'ఎందుకని?' ఏమీ తెలియనట్టుగా అడిగాడు.

"అదేం విచిత్రమండీ! మన వసూకి మా అన్నయ్య కొడుకు రఘుపతికి యీడు జోడు బాగుంటుంది. మీరొక్కసారి అన్నయ్యకు ఉత్తరం వ్రాస్తే...." భర్త ముఖంలోకి చూస్తూ మధ్యలోనే మాటనాపేసింది.

"అమ్మాయికి యింకా పద్దెనిమిదేళ్ళే. ఏమంత వయస్సు మించిపోయిందని పెళ్ళి పెళ్ళి అని అర్చాటిస్తావ్?" అయిష్టమైనప్పుడు విసుగుదల ఎక్కువగా వుంటుంది సుబ్బయ్య మేష్టారుకు.

"యుక్త వయస్సులో పెళ్ళి, నోము చేస్తేనే వారికి సంతోషంగా వుంటుంది. చూచే వారికి కనుల కింపుగా వుంటుంది."

"త్రేతాయుగం నాటి నీ తెలివితేటల్ని నా ముందు ప్రదర్శించకు."

"రఘు కూడా ఎస్సెల్సీ ప్యాసయినవాడే. గొప్ప ఆస్తి వుంది. ఒకరి చేతి క్రింది నౌకరీ చూసుకోకుండా భూములు చేసుకొంటున్నాడు. ఇంత కంటే మంచి సంబంధం ఎక్కడ దొరుకుతుందండీ!" పట్టుదలగా అంది రత్నమ్మ.

"మనమ్మాయి ఎస్సెల్సీ. వాడు అంతే. వాణ్ని మనమ్మాయి యెలా వొప్పుకుంటుంది "

"స్త్రీకి చదువు అవసరమే. అది తన సంసారం సరిదిద్దుకొనడానికి తన పిల్లల్ని సక్రమ మార్గంలో పెంచడానికి. వివేకంతో మెలగడానికి ఉపకరిస్తే చాలు. అంతేగాని. వీధినబడి వ్యవహారాలు తేల్చడానికి కాదు సమయం మించితే వసుమతి పెళ్ళిగురించి మాటాడడానికి అవకాశం దొరకదనే ఆత్రుత రత్నమ్మ మాటల్లో వుంది.


తల్లీదండ్రీ సంభాషణను వింటూ వసుమతి హాలులో కూర్చొని నవల తిరగేస్తూ వుంది. ఒక్కొక్కసారి వసుమతి మనస్సు తల్లిపక్షం వహిస్తుంది. మరో నిముషంలో తండ్రి పక్షం చేరుతుంది. ఎటూ తేల్చుకోలేని సందిగ్ధావస్థలో పడిపోయింది.

"బావ ఎంతో అందంగా వుంటాడు. బావను చేసుకొంటే తనకు ఏ కొరతా వుండదు.... అయినా బావను ఎందుకు చేసుకోవాలి.... తనకంటే ఎక్కువ చదివాడా ఏమిటి? తనెంతో అతనూ అంతే. పైగా అది పల్లెటూరు.... పల్లెటూరు వాతావరణమంటేనే తనకు పడదు" వసుమతి ఆలోచిస్తూంది.

"ఏమయినా కాని, నువ్వు తెలివిగా మాట్లాడుతున్నావే రత్నం!" నవ్వాడు సుబ్బయ్య మేష్టారు.

"మీ ముందు నా తెలివి ఎందుకు పనికొస్తుందిలెండి! మీరు చేసే పనులేమో మీరు చేస్తుంటారు."

"నువ్వలా బాధపడటంలో అర్థంలేదు



రత్నం! వసూని ఎం ఏ చదివించాలని వుంది. ఆ తరువాతనే దాని పెళ్ళి" భార్యను అనునయిస్తూనే తన నిశ్చయాన్ని తెలిపాడు.

"ఇంకా చదువెందు కండీ! చదివింది చాలు. పెళ్ళి ప్రయత్నాలేవో చూడండి. ఏ వయస్సుకు ఆ అచ్చటా ముచ్చటా తీరాలి"

బోధించేవాడేకాని బోధింపబడే వాడు కాదు సుబ్బయ్య మేష్టారు.

"పోవే. పిచ్చిదానా! చదువుల పరస్వతే నా కూతురు." అంటూ భోజనం పూర్తి చేసి లేచాడు.

తండ్రి మాటల్ని వింటూ "మంచి నాన్న", అని అనుకొంది వసుమతి.

మరునాడు స్నేహితురాలు మంగళను కలిసి తను కాలేజీలో చేరుతున్నట్లు చెప్పింది. మంగళను కూడ తనతోపాటు చేరమంది.

ఆ రోజంతా తీయని వూహల్తో గడప బోయే కాలేజీ జీవితాన్ని గురించి ఆలోచిస్తూ గడిపింది.

కాలేజీ తెరిచారు. వసుమతి, మంగళ పి. యు. సి. లో చేరారు.

రత్నమ్మకు అయిష్టమయినా అభ్యంతరం చెప్పలేదు. చెప్పినా చెల్లదని తెలిసిపోయింది.

"తగిలినప్పుడే దెబ్బబాధ తెలుస్తుందిలే" అని వూరుకొంది.

కూతుర్ని కాలేజీలో చేర్పిన సంగతి, తన సహోపాధ్యాయులతో చెప్పి ఆనందించాడు సుబ్బయ్య మేష్టారు.

కూతురికి కావలసిన పుస్తకాలన్నీ కొన్నాడు. వసుమతి పుస్తకాలన్నిటికి తెల్ల కాగితాలను అట్టలుగా వేసింది.కూతురికున్న శ్రద్ధకు ఎంతగానో సంతోషించాడు తండ్రి.

కాలేజీలో చేరిన పదిహేను రోజుల వరకు లెక్చరర్ల పేర్లు, విద్యార్థీ విద్యార్థినుల పేర్లు తెలుసుకోవడంలోనే గడచిపోయింది.

వసుమతి, మంగళ కలిసే కాలేజీకి వెళ్తున్నారు. కొన్ని రోజుల తరువాత మరి కొంతమంది ఆడపిల్లలు కూడా వారితో కలిశారు.

మొదట్లో వసుమతి. మంగళ తమ చదువు విషయమె చర్చించుకొంటూ వెళ్ళేవారు.మరునాడు చెప్పబోయే పాఠాల్ని ముందురోజే చదువుకుని వెళ్ళేవారు. మిగతా విద్యార్థినులు వారితో కలిసేసరికి పాఠాల్ని గురించి మాట్లాడుకోవడానికి వీల్లేకపోయింది.

ఆ బృందంలోని నిర్మల అనాకారేమి కాదు డబ్బున్న యింటి ఆడపడుచ కనుక 'ఉబుసుపోకకు కాలేజీలో చేరానంటుంది' పూట పూటకొక ప్రత్యేకతగా అలంకరించుకొంటుంది.

చదువుమీద యిష్టంలేదు కనుక, జరుగుతున్న పాఠాల్నిగాని, జరిగే పాఠాల్నిగాని గమనించవలసిన అవసరం లేదామెకు. ఎప్పుడూ సినిమాల్ని గురించి! కొత్తగా వెలువడే నవలల్ని గురించి గలగల మాట్లాడేది. ఏదో ఒక విట్టు విసరి కిలకిలమని గట్టిగా నవ్వేది.

నిర్మలతో వసుమతికి. మంగళకు చాలా కష్టమై పోయింది. ఆ విధంగా రోడ్డుమిద గట్టిగా మాట్లాడటం నలుగురు చూసి ఏమనుకొంటారోననే భయం. నిర్మలను ఎంత తప్పించుకుందామన్నా వీలుకాక పోయేది.

ఒకరోజు నిర్మల "ఎగుడ్ న్యూస్ ఫర్ యూ" అంది.

"ఏమిటో!" అన్నట్టు మిగతా ఆరు జతల కళ్ళు నిర్మలవైపు తిరిగాయి.

"హిస్టరీ లెక్చరరు ముకుందరావుకు నెక్స్టు వీక్‌లోనే పెళ్ళి పాపం! ఆయనకు కాబోయే సతీమణి ఎలా వుంటుందో తెలుసా?" నిర్మల మాటలో వెకిలితనం తొంగిచూసింది.

"నీలాగే అందంగా వుంటుందా?" ఒకమ్మాయి కొంటెగా ప్రశ్నించింది. నిర్మల నల్లగా వుంటుంది.

"నాలాగే వుంటే యింకేం తక్కువ? రెండు పెదవులు కలియవు. పళ్ళు ముందు కొచ్చి అడ్డుగోడలా నిలుస్తాయి. పాపం! మేష్టారు ఆ రెండు పెదవులను కలిపి ఎలా అందుకుంటాడో?" నిర్మల తన తెలివికి తనే మురిసిపోతూ కిసుక్కున నవ్వింది.

వసుమతికి ఆ సంభాషణ అసహనంగా వుంది. కాని, విధిలేక వారి జతను వదలి వెళ్ళలేకపోయింది.

ఆ రోజు మంగళ కాలేజీకి రానని సెలవుచీటీ తెచ్చియిచ్చింది. నిర్మల కోసం ఆగడం యిష్టంలేక ముందుగానే వసుమతి బయలుదేరింది. దారిలో వెళ్తూ. "యీవేళ మంగళను చూడ్డానికి పెళ్ళివారు వస్తున్నారు" అని అనుకొంది.

"నాతో యింక కాలేజీకి రాదేమో.... అయినా యింత త్వరగా ఎందుకు పెళ్ళి చేసుకోవాలి...."నడుస్తూనే ఆలోచిస్తోంది.

మంగళకు పెళ్ళి నిశ్చయమైంది. తాంబూలాలు పుచ్చుకొన్నరోజు వసుమతి వెళ్ళింది వాళ్ళింటికి.

"చాల బాగున్నాడు. అందమైనవాడు... అయినా పెళ్ళికింత తొందర పడ్డావేం చదువు మానేసి" అడిగింది వసుమతి.

మంగళ చిరునవ్వు నవ్వింది. ఆమె కళ్ళలో ఆనందం తొణికిసలాడింది.

మంగళ పెళ్ళికి వసుమతి తలిదండ్రులు కూడా వచ్చారు. వధువును. వరుణ్ణి చూసి రత్నమ్మ ఎంతగానో మురిసిపోయింది. ముచ్చటపడింది. ఆ మాటే మంగళ తల్లితోను అంది.

సుబ్బయ్య మేష్టారు కివేమీ పట్టలేదు.

ఎవరో అడిగారు "నీ కూతురికి పెళ్ళి ఎప్పుడు చేస్తావయ్యా" అని.

"పెళ్ళి చేసి, యిప్పట్నించే దాన్ని సంసార కూపంలో తోయలేను. మా అమ్మాయిని ఎం. ఏ. చదివించి, దాని కాళ్ళమిద అది నిలబడే శక్తి సంపాదించుకొన్నప్పుడే, గొప్ప సంబంధం చూసి దర్జాగా పెళ్ళి చేస్తాను" సుబ్బయ్యమేష్టారు మాటల్లో కూతురిమిది ప్రేమ ప్రస్ఫుటమౌతోంది.

రత్నమ్మ అటు వెళ్తూ తన భర్త మాటల్ని వింది, ఆ మాటలకు మనస్సులోనే మధనపడింది. తన కూతురికి పెళ్ళి




MFGRS; PHARMA-MEDICO (INDIA) PVT. LTD. BOMBAY-60-NF
ఏజెంట్లు: (1) సిటీ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్, భావనారాయణ వీధి, విజయవాడ–1 (ఆం.ప్ర.)
(2) ఫార్మా ట్రేడర్స్ (హైదరాబాద్) కందస్వామి రోడ్, సుల్తాన్ బజార్, హైదరాబాద్ (ఆం.ప్ర.)

# మాట్లాడని మల్లెమొగ్గ

యోగం వుందో. లేదో అని తోచేసరికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి

వసుమతి తల్లి దగరే కూర్చొని ఉంది.

"నీ స్నేహితురాలికేమో పెళ్ళయిపోయింది. వసూ. నీవెప్పుడే పెళ్ళిచేసుకొంటావు" ప్రక్కనున్న ముసలావిడ వసుమతి భుజాన్ని మెల్లగా తట్టుతూ అంది.

"నే నిప్పుడే పెళ్ళి చేసుకోను అవ్వగారూ! నా చదువు పూర్తయిం తరువాతే!" అంది వసుమతి జవాబుగా.

"ఏం చదువులో ఏమోనమ్మా! మాయదారి కాలం అన్నీ విడ్డూరమే అయిపోతున్నాయి." అని బుగ్గమీద వేలు వేసుకొనింది ముసలమ్మ.

"ఈ చదువులన్నీ పూర్తయ్యేసరికి యీ వయస్సే వుంటుందా? యీ ఆనందమే వుంటుందా?" మరొకామె అడుకొనింది సందర్భం చూసి.

రత్నమ్మకా మాటలు బాధగానే వున్నాయి. ములుకుల్లా గుచ్చుకొంటున్నాయి అయినా ఆమె నిస్సహాయురాలు.

వసుమతి కోపమొచ్చి అక్కడనుండి లేచివెళ్ళింది.

"నీవయినా మీ ఆయనకి చెప్పకూడదటే" ఆ ముసలామె రత్నమ్మనే రంగంలోకి లాగింది.

"నా మాట వినేవారెవరున్నారు? అంతా దాని ఖర్మ. నా ఖర్మ!" రత్నమ్మ మనసు ఆవేదనతో రగిలిపోయింది.

దూరంగా నిలబడి తల్లిని చూసి. 'అమ్మ బి సి. నాటిది అంతా చాదస్తం" అని అనుకుంది వసుమతి.

వసుమతి పి. యు సి. ఫస్టు క్లాసులో పాసయ్యింది. స్నేహితురాండ్రు కాంప్లిమెంటు చేశారు. పై చదువులు చదవమని ప్రోత్సహించారు.

తన కూతురు ఫస్టు క్లాసులో ప్యాసు కావడం సుబ్బయ్యమేష్టారు ఎంతో గర్వంగా ఆనందించాడు. ఆ మాటే పదిమందికీ మరింత గర్వంగా చెప్పాడు.

"ఏమండీ! యిప్పుడయినా నా మాట వినండి. దానికి పందొమ్మిదేళ్ళు నిండాయి యిప్పటికే నల్గురిలో తలెత్తుకోలేకున్నాను." రత్నమ్మ భర్తతో అంది.

"ఎందుకు తలెత్తుకోలేవు? నా కూతురు చేయరాని పనేమి చేసింది కనుక..."వుగ్రుడయ్యాడు సుబ్బయ్యమేష్టారు.

"దాని ఈడువాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకుని. చక్కగా కాపురాలు చేసుకుంటున్నారు".

"చేసుకుంటే చేసుకోని. నాకవేమీ చెప్పకు."

భర్త పట్టుదలముందు రత్నమ్మకు విలువ లేకపోయింది.

బి. ఏ.లో వసుమతికి నిర్మల మంచి స్నేహితురాలయింది. నిర్మల మాటలంటే క్రమంగా విసుగుదల. అసహ్యం తగ్గిపోయింది వసుమతికి.

ఒకనాడు నిర్మల వసుమతిని "మ్యాటినీ షో"కు రమ్మని పిలిచింది.

"ఈవేళ క్లాసుంది. నేను రాను నిర్మలా" అంది వసుమతి.

"వసూ! నువ్వెంతో తెలివైనదానివి. నాలాగా ఒక్కొక్క పాఠం పదిమార్లు చదివి బట్టీ పట్టాల్సిన అవసరం లేదు. అందులో ఇప్పుడున్నది హిస్టరీ క్లాసు. ఆ ముకుందరావు చెప్పింది వినకపోయినా ఫరవాలేదు." నిర్మల మాటల్లో వాస్తవం నమ్మకం తోచాయి వసుమతికి.

"అయినా నేను డబ్బు తెచ్చుకోలేదే" అని సందేహిస్తూ అంది.

"డబ్బుదేముందే? యీ పర్సు నీదే ననుకో!" అని పుస్తకాల నడుమ దాచిన పర్సు తీసింది నిర్మల.

ఆ రోజుకు హిస్టరీ క్లాసుకు వెళ్ళలేదు.

నిర్మల భావాలతో తన భావాలను కలుపుకొంటూ కాలేజీకి వెళ్ళి వస్తోంది. వసుమతి.

బి.ఏ. రెండవఏడు కొచ్చేసరికి నిర్మలకు కూడా పెళ్ళయింది. నిర్మల తండ్రి బాగా డబ్బున్నవాడు కనుక పదిహేనువేలు కట్నమిచ్చి పెళ్ళి చేశాడు. అర్థంతరంగా చదువాపేసి పెళ్ళి చేసుకొన్నందుకు నిర్మల మీద కూడా కోపమొచ్చింది వసుమతికి. ఆ కోపం చదువుమీద పట్టుదలగామారింది.

రమేష డబ్బున్న వాడేమీ కాకపోయినా తెలివైనవాడు. అతనికెప్పుడూ పోటీగా వసుమతి నిలిచేది మార్కుల్లో. రమేష ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. అందునా విద్యార్థులతో అసలు మాట్లాడేవాడు కాదు. ఎవరైనా ఎదురుపడి మాటలాడి స్తే ముక్తసరి జవాబుతో తప్పుక పోయేవాడు.


వసుమతికి రమేష్ అంటే ఒక విధమయిన మంచి అభిప్రాయం కలిగింది. ఆ అభిప్రాయం ఆసక్తిగా మారడానికి మరికొన్ని పరిస్థితులు దోహదం కలిగించాయి.

రమేష్ వేసిన అడుగుల్లో అడుగులు వేసి సంబరపడింది. అతని చూపుల్లో చూపులు కలపాలని తపనపడి కలలు కనింది. తనకు తానే అతనిపై రక్తి. అనురక్తి కలిగించుకొనింది. క్రమేపీ రగిలించుకొనింది. మాటల్లో మాటకలిపి అతని హృదయ చౌర్యం చేయాలనుకొని. తానే హృదయం పోగొట్టుకొనింది.

వసుమతి సుమతి కాకపోవడముతో కాలమాగలేదు. రోజులు దొర్లిపోయాయి. ప్రేమలో ఒక విధమైన గొప్పదనం కనిపించింది వసుమతికి. ప్రేమించడములో ఒక విధమైన మత్తుగలిగి హాయనిపించింది కానీ ఆ హాయి దొరలిపోయిన రోజులతోనే వెళ్ళిపోయింది.

వసుమతి మూడవ ఏడు బి. ఎ.లో కొచ్చేసరికి కుటుంబ పరిస్థితుల కారణంగా రమేష్ చదువాపేశాడు. తరువాత కొన్ని రోజులవరకు చాలా కొరతగా కనిపించింది కాలేజీ వాతావరణం వసుమతికి.

"అయినా, ఈ కాలేజీ స్నేహం రైలు ప్రయాణం వంటిది.... రమేష్‌లో ఏముందని తను అంతగా బాధపడడానికి...."



అని అనుకొని తనకు తానే సర్దుకొనింది.

........

"అమ్మ యీమధ్య చాలా చింతగా వుంటోంది. ఒక్కోసారి వున్నట్టుండి తన మీద చిరాకుపడుతోంది. ఎక్కడ ఎవరికి పెళ్ళయినా అమ్మ కుమిలిపోతోంది. ఏ ఇంట్లో బారసాల జరిగినా తనను చూసి కన్నీళ్ళు పెటుకొంటుంది. . ప్చ్.... అమ్మదంతా ఛాదస్తం ... నాన్న కూడ ఈ మధ్య మారుతున్నట్టున్నాడు ... రెండుమూడు సారు పెళ్ళిప్రసక్తికూడా తీసుకువచ్చాడు" వసుమతి ఆలోచిస్తూ హిస్టరీ లెక్చరర్ వింటోంది.

అంతలో పోస్టుమాన్ టెలిగ్రాం తెచ్చి యిచ్చాడు లెక్చరర్ ముకుందరావుకు. కవరునుండి టెలిగ్రాం తీసి చదువుకొన్నాడు. చూడటానికి మరీ అంత వికాసవంతమైన ముఖం కాకపోయినా, ఆ క్షణంలో వికాసవంతమైంది.

"అంత సంతోషం కలిగించే వార్త మేము కూడా తెలుసుకోవచ్చా సార్!" ఒక విద్యార్థి అడిగాడు కుతూహలంగా.

"ష్యూర్! ష్యూర!.... అయామ్ బ్లెసెడ్ విత్ సన్. నాకు కుమారుడు కలిగాడోయ్!"

లెక్చరర్ ఆనందానికి కారణభూతమైన వార్త. వసుమతి మనస్సును మేనబావ రఘుపతి మీదకు మరల్చింది.

"బావకిప్పుడు యిద్దరు కొడుకులు.... ఆ నాడు అమ్మ మాటలే వినివుంటే తను యిద్దరు కొడుకుల తల్లిగా. ఆనందంగా వుండేది.... అమ్మమాటల్లో నిజం లేకపోలేదు.... అయినా అప్పుడు తండ్రి మాటల్లోనే నిజం కన్పించింది...." గాఢంగా నిటూర్చింది వసుమతి.

మనస్సులోని వేడి నిటూర్పులో కలిసిపోయింది.

పాఠం మీద మనస్సు నిలువలేదు.

సగం చెట్టునెక్కి క్రిందకు దిగజారడం ఏమిటి? చెట్టునెక్కి ఫలాన్ని అందుకోవాలిగాని.... మధ్యలో ఈ చపలత్వమొకటి మూర్ఖంగా...." తన్ను తాను అదుపులో పెట్టుకొన ప్రయత్నించింది.

కాలేజీ వదిలిన తరువాత తనతో చదివే విద్యార్థినులతో వెళుతోంది. అందరిలోవున్నా ఆమెఆలోచనలు ఆమెను వెన్నంటేతూన్నాయి. చేతిలోని నోటుబుక్కును ఇటు అటు త్రిప్పుతూ నడుస్తోంది. పుస్తకానికి వేసిన అట్టమిదిసినిమా బొమ్మను పదే పదే చూస్తోంది.

"ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్? మాటా పలుకు లేకుండా."

సరోజ అడిగింది వసుమతిని.

సరోజ బి ఎస్సీ విద్యార్థిని

వసుమతి చేతిలోని పుస్తకాన్ని త్రిప్పుతూనే వుంది.

"సరూ! ఒక ప్రశ్నవుంది. సరియైన జవాబు చెప్పగలవా?" అట్టమీద వున్న బొమ్మను చూస్తూ అడిగింది వసుమతి.

"అంత కఠినమైన ప్రశ్నా అది. అడుగు చూదాం!"

"స్త్రీ జీవితానికి సంపూర్ణత్వాన్ని ఇచ్చేది ఏది?' మెల్లగా అడిగింది.

"ఓస్! ఇంతేనా! మరేదో కఠినమైన ప్రశ్నేమో ననుకొన్నాను. దీనికి జవాబు తేలికగా చెప్పగలను" సరోజ కనులు మిలమిలలాడాయి.

చెప్పమన్నట్టుగా సరోజను చూసింది వసుమతి.

"విద్య, ఉద్యోగం, స్వేచ్ఛగా ఉండటం స్వతంత్రంగా జీవించడం" సరోజ మాటలు వికృతంగా వినబడ్డాయి. కొరడాలా ఝుళిపించాయి.

వసుమతి మనస్సు ఎదురు తిరిగింది.

"కాదు. కానేకాదు స్త్రీని స్త్రీగా నిలిపేది మాతృత్వం' వసుమతి మనస్సులోసుడులు తిరిగిన మాటలు పెదవి దాటి రాలేదు.

బొమ్మమిదనుంచి దృష్టి మరల్చలేకపోయింది. ఆ బొమ్మలో తల్లి బిడ్డనెత్తుకొని నవ్వుతూ వుంది.

బి ఏ. కడపటి సంవత్సరపు పరీక్షలయిపోయాయి. వసుమతికి ఇంట్లో కాలం గడపటమే కష్టమైపోయింది. ఒకసారి బావను చూడాలనిపించింది........

తన బావ రఘు చాలా మంచివాడు.తను ఆ నాడు గగన కుసుమాలను కుసుమాలుగా భ్రమించి బావను పెళ్లాడడానికి నిరాకరించింది. బావకీ సంగతి తెలిసి నవ్వి వూరుకొన్నాడట, తరువాత సుశీలను చేసుకున్నాడు. ఆమె కూడా స్కూలు ఫైనలు ప్యాసయ్యిందట. ఆమె అదృష్టవంతురాలు ఈనాడామె అన్నివిధాలా హాయిగావుంది...

వసుమతికి యితర వ్యాపకం లేకపోవడముతో ఆలోచనలు నిలకడగా వుండడం లేదు.

మంగళ అత్తవారింటినుండి రేపు వస్తున్నట్టుగావుత్తరం వ్రాసింది. తనే స్టేషన్‌కు వెళ్ళి రిసీవ్ చేసుకోవాలి....

.... అప్పుడే నాలుగు గంటలయింది. ఈ వేళ సినిమా కెళ్తే బాగుంటుంది. కొంత కాలహరణ.... కానీ, అమ్మ ఏమంటుందో? తన విషయంలో అమ్మ చాలా నిర్లిప్తంగా వుంటోంది. అనవసరంగా లోలోపల కుమిలిపోతోం ....

.... తల్లి మనస్సుకది అవసమేమో?....

ఏమో తనకా మనస్సు వుంటే గదా తెలిసేందుకు....

వసుమతిని ఒక విధమైన భీతి ఆవరించింది. ఆవేదన పీడిస్తోంది.

....కొన్ని పరిస్థితులలో తను పిరికిది. మూగది....

వసుమతి ఆకాశం వంక చూసింది, మబ్బులు గుమిగూడుతున్నాయి

....తన మనస్సుకు ప్రత్యక్షరూపంగా ఆకాశం ఆలోచనలవంటి మబ్బులతో కుంచించుకపోతోంది .... యింత చల్లగా గాలి వీస్తోంటేకూడా ఏమో వేడిగానే వుంది....భోరున వర్షం వస్తే, వర్షంలో నానితే హాయిగా వుంటుంది....

... ఇక్కడకూడా విధి తనకెదురే.... మబ్బులు అప్పుడే విడిపోతున్నాయి.... ఇంకెక్కడి వర్షం....ఎక్కడి హాయి....

రత్నమ్మ పిలవడంతో లోనికివెళ్ళింది వసుమతి కలతబారిన మనస్సుతో.

మంగళ అత్తవారింటినుండి వచ్చింది. వచ్చిననాడే వసుమతిని చూడాలని యింటికి వచ్చింది.

వసుమతి మంగళకు ఎదురువెళ్ళి, మంగళ చంకనున్న బాబుని ఎత్తుకొంది.

"బాబుకు మునుపటికన్న బాగా వొళ్ళు చేసి ముద్దొస్తున్నాడు" అని అంటూ బాబు లేత బుగ్గలు ఎర్రపడేలా ముద్దు పెట్టింది వసుమతి.

"బాబు వాళ్ళ నాన్న పోలికే" వసుమతి బాబును పరీక్షగా చూస్తూ అంది.

"ఆఁ అవును. వాడు తండ్రి పోలికే" మంగళ కొద్దిగా సగ్గుపడుతూ అంది.

రత్నమ్మ టిఫిన్ ప్లేటు మంగళముందు పెట్టి, ఆడుకొంటున్న బాబును ఎత్తుకొనింది.

"వసూ! మంగళకు మంచినీళ్లు తెచ్చి పెట్టమ్మా!" అంది రత్నమ్మ.

వసుమతి వెళ్ళింది.

"చూశావుగా మంగళా! నీ స్నేహితురాల్ని, దానిఈడువాళ్ళు మీరంతా హాయిగా పచ్చగా కాపురాలు చేసుకొంటుంటేకన్నుల పండువగా. మనసుకుతృప్తిగా వుంటుంది'.

ఒకసారి దీర్ఘంగా, భారంగా నిట్టూర్చింది.

మంగళ రత్నమ్మను అర్థంచేసుకొంది.

"పెళ్ళీడు మించిన కూతురు ఏ తల్లికి ఆనందం కల్గిస్తుంది' రత్నమ్మ ఆవేదనను సరిగ్గా అంచనావేసింది.

"మీ ఆయనతో చెప్పి ఏవైనా మంచి సంబంధాలు చూడు తల్లీ! దీన్ని చూస్తూ యిటు బ్రతకలేక, అటు చావలేక కుమిలిపోతున్నా" రత్నమ్మ కంట తడి పెట్టింది.

"నేను ప్రయత్నం తప్పకుండా

చేస్తాను. పిన్నీ!" అంది మంగళ.

అంతలో వసుమతి నీళ్ళు తీసుకొని వచ్చింది.

"మీరు మాట్లాడుకొంటూ వుండండి. నేను కాఫీ చేసి తెస్తాను." రత్నమ్మ అక్కడనుండి లేచింది.

తన కంటినీరు వసుమతి గమనించడం యిష్టంలేదు రత్నమ్మకు.

మంగళకు దగ్గరగా వసుమతి కూర్చుంది మౌనంగా.

"ఏమే, మౌనంగా వున్నావు?" మంగళ అడిగింది.

"ఏముంది నేను చెప్పడానికి? నన్ను చూస్తున్నావుగా ఇవ్వటి వరకు మునుపటి లాగానె వున్నా" మెల్లగా అంది వసుమతి.

మెల్లగా అన్నా. ఆ మాటల్లో కన్నె చెరలోని బాధ యిమిడి వుంది.

"నేను ఎల్లుండే వూరికి వెళ్లాలి." అంది మంగళ ప్రస్తావనను మరల్చాలని.

"ఏం? అంతతొందర"

"నాకేం అంత తొందర లేదు. నేను లేకపోతే వారు ఒక్కపూటయినా సరిగ్గా భోంచేయరు" నవ్వింది మంగళ.

"అదృష్టవంతురాలివి మంగళా!"

"నీవు నా కన్నా అదృష్టవంతురాలివి త్వరలో కావాలని కోరుకొంటున్నాను."

మంగళ మాటలకు నిర్లిప్తంగా నవ్వింది వసుమతి.

మంగళ వెళ్ళి మూడవ రోజు వూరికి వెళ్ళిపోయింది.

"ఈ సంగతి నాన్నకు చెప్పడమెలా?" ఒకరోజు సాయంకాలం జాజిమొగ్గలు కోస్తూ అనుకొంది వసుమతి

"నాన్న ఎం. ఏ. చదవమంటాదేమో! .... నాకు చదవాలనే వుంది .... చదివింతరువాత...?" అగమ్యంగా తోచింది ఒక్కక్షణం.

'ఉద్యోగం చేయాల్సివుంటుందేమో..?' అని జవాబుగా అనుకొని 'అలా ఎన్నాళ్లో' అని తోచేసరికి మనస్సు బరువెక్కింది

జాజిమొగ్గలు కోసుకొని యింట్లోకి వచ్చింది వసుమతి. తన విషయమై తల్లిదండ్రులు మాటలాడుకోవడం విని, అక్కడే చాటుగా నిలబడింది.

"ఏమండీ! యికనైనా నా మాట వినండి! అమ్మాయికి యిరవై రెండేళ్ళు నిండుతున్నాయి. చదివిన బి. ఏ. చాలు. పెళ్ళి ప్రయత్నాలు చూడండి! ఇప్పటికే నలుగురు నానా రకాలుగా అంటున్నారు" రత్నమ్మ అంటోంది.

"నాకూ అలాగే అనిపిస్తోంది. నేను ప్రయత్నాలు చేస్తున్నాను. దేనికైనా కాలం కలిసిరావాలి." భర్త మాటలకు సంతోషించింది రత్నమ్మ.

ఆ మాటలు విన్న వసుమతి చేతిలో వున్న జాజి మొగ్గలను గటిగా వాసన చూసింది. 'అమ్మకు నా మనసు తెలుసు మంచి అమ్మ." అని అనుకొనింది.

ఆ తరువాత, ఒక రోజు రఘు వూరినుండి వచ్చాడు స్వంత పని మీద. వసుమతి చూచి, చనువుగా పల్కరించాలని వుందీ. కాని మనస్సులోని సిగ్గుతో పల్కరించలేకపోయింది.

రఘూయే పల్కరించాడు వసుమతిని. ఆమె చదువు సంగతి విచారించాడు. వసుమతి చాల వరకు ముక్తసరిగా జవాబిచ్చింది.

బావతో ఏమేమో మాట్లాడాలనుకొన్న వసుమతి క్షేమ సమాచారమన్నా అడగలేకపోయింది.

రత్నమ్మ. రఘు మాటాడుకొంటూండే వారి మాటల్ని వింటూ దగ్గరగా కూర్చొనింది వసుమతి.

"ఒరేయ్. రఘూ! వసూకు త్వరలో పెళ్ళి చేయాలని మీ మామయ్య కూడా అనుకొంటున్నారు. నీవుకూడా ప్రయత్నం చేయి" రత్నమ్మకు వున్నది. ఒకే ఆలోచన, ఒకే ధోరణి.

బావ ఏమంటాడోనని రఘూనే చూస్తోంది వసుమతి.

రఘు. వసుమతి వైపొక సారి చూసి. రత్నమ్మతో అన్నాడు. "మంచి సంబంధమే వుందనుకో. వాడు కూడా వసుమతి లాగా బి. ఏ. చదివాడు.... తనతో సమానమైన డిగ్రీ వున్నవాడిని వొప్పుకొంటుందా అని ఆలోచిస్తున్నాను ....అవును గాని అత్తయ్యా! ఇంతకీ వసుమతి ఎం. ఏ. చదవదా ఏమిటి?"

వసుమతిలోని అభిమానం వులిక్కిపడింది.

"ఏం? ఎందుకు చదవను? ఎం. ఏ. చదివి తీరుతాను. అంతవరకు నా పెళ్ళి కోసం నీవేం బాధపడనవసరం లేదు." ఉక్రోషంతో అని అక్కడనుండి వెళ్ళిపోయింది.

రఘు నిశ్చేష్టుడయ్యాడు.

రత్నమ్మ "ఇదంతా నా ఖర్మ". అని నెత్తి కొట్టుకుంది.

* * *

'ఛీ! ఛీ! ఈ చలిగాలి వొకటి దహించివేస్తోంది అగ్నికి వాయువు తోడైనట్టు. మన్మధజ్వాల మరింత రగిలింది.

రవిక వదులుచేసుకుంది వసుమతి

జడలో మల్లెలు విరిసివున్నాయి, మత్తువాసనతో వున్న మల్లెలదండ బరువుగా తోచింది. దండను జడనుంచి తీసి కసిగా విసరివేసింది. అది ప్రక్కనున్న మల్లెపొదపైపడింది.

తను రెండేళ్ళగా హిస్టరీ లెక్చరరుగా వుంటోంది. కావలసినంత సంపాదిస్తోంది.. తనకు సంపాదన అనవసరం.... తనకు కావలసింది డబ్బుకాదు.... డబ్బుకాదు.... వసుమతికి ఏమి తోచలేదు.

తన స్టూడెంటు సుశీలకు పెళ్ళి.... రమ్మని ఆహ్వానించింది. నవ్వు వచ్చింది వసుమతికి.

స్నేహితురాంద్రకే కాదు, శిష్యురాంద్రకూడా పెళ్ళిళ్ళయి పోతున్నాయి.

ఆకాశంవైపు చూసింది.... ప్చ! చంద్రుడు కూడా తనను చూసి పారిపోతున్నాడు....

వచ్చినవారు వచ్చినట్టే వెళ్ళిపోతే నాన్నమాత్రం ఏంచేస్తాడు? పాపం! తన కోసం ఎన్ని కలలుకన్నాడు...పిచ్చినాన్న.

"అమ్మ సరేసరి. గుండెల మీదకుంపటి వున్నట్టు కుమిలిపోతూంది. తనతో మాట్లాడటమే మానేసింది.... పాపం! అబల అంతకన్నా చేసేదేముంది."

వసుమతి ఆలోచనలతో నిద్ర పోగొట్టుకొనింది.

"తనుమాత్రం పౌరుషానికి పడి కొని తెచ్చుకున్నదేమిటి?"

మనస్సు వేడెక్కిపోతూంది.

చల్లటి గాలి జోరుగా వీచింది.

"ఈ గాలిక్కూడా నేనొక ఆటబొమ్మయిపోయాను...."ఆవలింత వచ్చింది వసుమతికి.

ఎక్కడో గడియారం మూడు గంటలు కొట్టింది.

గాలికి మల్లెపొద వూగింది. వసుమతి విసరిన పూలదండ చెట్టుతో పాటుగా ఊగింది.

"ఆ వెక్కిరింతను భరించలేనట్టుగా వసుమతి చివాలున లేచి ఆ దండను తీసి బలంగా, దూరంగా పారేసింది.

"ఎందుకో యీవేళ ఇంత క్రూరంగా మారిపోయాను...."

మంచంమీద కూర్చొని కళ్ళలో నీళ్ళు పెట్టుకుంది. ఆత్మవంచన భరించలేకపోయింది.

"ఈ మంచులో ఇలాగే గడ్డకట్టుకుపోతే అదేచాలు. భగవాన్!" దుప్పటి నిండుగా కప్పుకొని పడుకుంది.

మంచునీటి బొట్లు మల్లెచివురు మీద నుంచి విరుస్తున్న మొగ్గపైపడి నేలబడ్డాయి.

అదిచూచి, వెన్నెల నిట్టూర్చింది.

★